## బీటెక్ తప్పినా ఓ సర్టిఫికెట్

- సగం క్రెడిట్లు సాధిస్తే చాలు
- త్వరలో విధివిధానాల రూపకల్పన

ఈనాడు, హైదరాబాద్: నాలుగేళ్లు బీటెక్ చదివిన విద్యార్థి ఏదైనా ఒక్క సబ్జెక్టులో తప్పినా డిగ్రీ పట్టా రాదు. విద్యార్థి నాలుగేళ్ల కాలం వృథా అయినట్లే. ఇక నుంచి రాష్ట్రంలో సగం క్రెడిట్లు.. అంటే 50 శాతం సబ్జెక్టులు పాసైనా ఆ మేరకు ఓ సర్టిఫికెట్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. నాలుగేళ్ల బీటెక్‌లో 160 క్రెడిట్లు ఉంటాయి. ఒక్కో సెమిస్టర్‌కు 20 క్రెడిట్లు ఇస్తారు. కనీస మార్కులతోనైనా అన్ని సబ్జెక్టులు పాసైతే వారు 160 క్రెడిట్లు సాధించినట్లే. సెమిస్టర్‌కు ఐదారు సబ్జెక్టులుంటాయి. వాటిలో సగం పాసైతే 80 క్రెడిట్లు పొందుతారు. కానీ, ప్రస్తుత విధానంలో ఏ ఒక్క సబ్జెక్టు తప్పినా ఆ విద్యార్థి బీటెక్ పట్టా పొందేందుకు అర్హులు కాదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వారికీ సర్టిఫికెట్ ఇవ్వాలని నిర్ణయించింది. దీనిపై త్వరలో విధివిధానాలను రూపొందించనుంది. విశ్వవిద్యాలయాల్లో పరీక్షల ఫీజు, ఒక ఏడాది నుంచి మరో ఏడాదికి ప్రమోట్ అయ్యేందుకు అవసరమైన క్రెడిట్లు రకరకాలుగా ఉండటంపై కూడా అధికారులు చర్చించనున్నారు.

# అంబేడ్కర్ జయంతి జాతీయ సెలవు దినం

న్యూఢిల్లీ, మార్చి 28: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 14ను జాతీయ సెలవు దినంగా ప్రకటిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ శుక్రవారం ఎక్స్ ద్వారా తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 14 సోమవారం రానుంది. ఆ రోజున పబ్లిక్ హాలిడేగా ప్రభుత్వం గుర్తించింది. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించడంతో పాటు, సమాజంలో సమానత్వ యుగాన్ని స్థాపించారని, ఆయన సేవలకు గుర్తుగా సెలవు దినంగా ప్రకటిస్తున్నట్టు మంత్రి తెలిపారు. బాబాసాహెబ్‌ను భక్తిపూర్వకంగా అనుసరించే ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మనోభావాలను గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు.

## జేఎన్‌టీయూలో 'ఆర్సీ ఎయిర్ క్రాఫ్ట్'

- వ్యోమా కంపెనీ సహకారంతో రూపకల్పన
- మైదానంలో ఎగురవేసిన మెకానికల్ విద్యార్థులు


ఎయిర్‌క్రాఫ్ట్‌ను రూపొందించిన విద్యార్థులు

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు శుక్రవారం విమానాల ఆవిష్కరణకు శ్రీకారం చుట్టారు. వ్యోమా కంపెనీ సహకారంతో రేడియో కంట్రోలర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను రూపొందించారు. దాన్ని శుక్రవారం సాయంత్రం యూనివర్సిటీ మైదానంలో ఎగురవేసి, ఇతర విభాగాల విద్యార్థులను అబ్బురపరిచారు. ఈ ఎయిర్‌క్రాఫ్ట్ రూపకల్పనలో వ్యోమా అనే స్టార్టప్ కంపెనీ సాంకేతిక సహకారం అందించిందని విద్యార్థులు తెలిపారు. స్టార్టప్ ఆలోచన ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడానికి వ్యోమా ప్రతినిధులు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించారని వివరించారు. కాగా, ఈ తరం విద్యార్థులకు పుస్తక పఠనం మినహా, ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉండడం లేదని, ఆవిష్కరణల పట్ల ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించడానికే ఈ వర్క్‌షాప్ నిర్వహించామని వ్యోమా ప్రతినిధులు తెలిపారు. ఎయిర్‌క్రాఫ్ట్ రూపకల్పనను పర్యవేక్షించిన మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్లు డాక్టర్ రాంజీ, డాక్టర్ వసంత్, ఎయిర్‌క్రాఫ్ట్‌ను విజయవంతంగా ఎగురవేసిన కొవైజన్స్ టీమ్ విద్యార్థులను అభినందించారు.


ఆకాశంలో ఎగురుతున్న విమానం

## మౌలిక వసతుల కల్పనకు
# ఈసీ పచ్చజెండా

- పదవీకాలం పూర్తయిన వారికి మరికొంత సమయం
- అంతిమ నిర్ణయం వీసీదే
- జేఎన్‌టీయూ పాలకమండలి సమావేశంలో సభ్యులు



హైదరాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పాలకమండలి పచ్చజెండా ఊపింది. యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కిషన్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం సచివాలయంలో జరిగిన పాలకమండలి సమావేశంలో కొన్ని అంశాలను పాలకమండలి ఏకగ్రీవంగా ఆమోదించగా, మరికొన్ని అంశాలపై సభ్యుల మధ్య వాడీవేడిగా చర్చ జరిగినట్లు తెలిసింది. ముఖ్యంగా వర్సిటీ అనుబంధ కళాశాలల్లో విద్యార్థులకు తరగతి గదులు, వసతి గృహాలు, కంప్యూటర్లు, క్రీడా సదుపాయాలు వంటి అంశాల నిమిత్తం వర్సిటీ అధికారులు సమర్పించిన సుమారు రూ.50కోట్ల విలువైన ప్రతిపాదనలకు పాలకమండలి సభ్యులు ఆమోదం తెలిపారు. యూనివర్సిటీలో పదవీకాలం పూర్తయిన కొంతమంది ఉన్నతాధికారులను మరికొంత కాలం పాటు యథాతంగా కొనసాగించాలని కొందరు సభ్యులు వీసీకి సూచించినట్లు తెలిసింది. అయితే, ఈ అంశంపై అంతిమ నిర్ణయాన్ని వీసీకే సభ్యులు వదిలేసినట్లు తెలిసింది. అలాగే, జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవం నిర్వహణకు సంబంధించిన అంశంపై కాసేపు చర్చ జరిగినప్పటికీ సమయాభావం వల్ల కొలిక్కిరాలేదని అధికారిక వర్గాలంటున్నాయి. అయితే, సమావేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఆమోదం లభించిందని వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు చెప్పారు.



## డిగ్రీలో ప్రతి సెమిస్టర్‌కూ
# ఓ టెక్నాలజీ సబ్జెక్టు!

- బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో పక్కాగా అమలు
- చివరి ఏడాది రెండు ఇంటర్న్‌షిప్‌లు
- సిలబస్ మార్పుపై కసరత్తు కొలిక్కి

ఈనాడు, హైదరాబాద్: "తెలంగాణలో విద్యార్థులు డిగ్రీ పూర్తి చేస్తే.. ఆ పట్టాతో జాబ్ మార్కెట్‌లో ఉద్యోగం పొందాలి. లేదంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకింగ్ రంగాల్లో పోటీ పరీక్షలకు ఎటువంటి ప్రత్యేక కోచింగ్ లేకుండా పోటీపడాలి. ఐదీ కాదంటే వారే సొంతంగా స్వయం ఉపాధి చూసుకునేలా తయారవ్వాలన్నదే మా లక్ష్యం" అని ఉన్నత విద్యామండలి స్పష్టంచేస్తోంది. తదనుగుణంగా రెండు నెలలుగా సిలబస్‌లో మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తోంది.

...మిగతా 2లో

# న్యాక్ గ్రేడింగ్‌కు సహకరించండి

## కేంద్ర విద్యాశాఖకు ఉన్నతాధికారుల వినతి



ఈనాడు, హైదరాబాద్: విశ్వవిద్యాలయాలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించేందుకు అవసరమైన న్యాక్ గ్రేడింగ్‌కు కేంద్ర విద్యాశాఖ అధికారులు సహకరించాలని విశ్వవిద్యాలయాల ఉన్నతాధికారులు కోరుతున్నారు. ప్రతి పదిహేను మంది విద్యార్థులకు ఒక ఆచార్యుడు తప్పనిసరిగా ఉండాలన్న నిబంధనను పాటించాలంటే అవసరమైన సంఖ్యలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు తగినంత మంది లేరని చెబుతున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లను పరిగణనలోకి తీసుకుంటే న్యాక్ గ్రేడింగ్ మెరుగ్గా ఉంటుందని జాతీయ గ్రేడింగ్ బోర్డు (ఎన్‌బీఏ) చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుద్ధేను అభ్యర్థించారు. న్యాక్ గ్రేడింగ్ తక్కువగా ఉంటే భవిష్యత్తులో ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రభుత్వ రంగ, బహుళజాతి సంస్థలు పరిశోధనలపై సంయుక్త ఒప్పందాలు కుదుర్చుకునేందుకు రావని వివరించారు. త్వరలో సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు.

| విశ్వవిద్యాలయం | కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు |
|---|---|
| ఉస్మానియా | 240 |
| మహిళా | 120 |
| జేఎన్‌టీయూ | 140 |
| డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ | 21 |
| తెలుగు | 15 |

### విద్యార్థుల పరిశోధనలు.. ప్రాజెక్టులపై ప్రభావం..

జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయాలకు గుర్తింపు, న్యాక్ గ్రేడింగ్ లేకపోతే విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు, పీహెచ్‌డీ పరిశోధకుల ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపనుంది. పైగా విభాగాల్లో శాశ్వత పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు తక్కువ మంది ఉండడంతో బహుళజాతి సంస్థల ప్రతినిధులు వీరితో సంయుక్తంగా పరిశోధనలు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఒక బహుళజాతి సంస్థ రూ.5 కోట్లతో పరిశోధన ప్రాజెక్టు నిర్వహించేందుకు ముందుకు రాగా... ఆ విభాగంలో ప్రొఫెసర్లు లేకపోవడంతో మరో విశ్వవిద్యాలయాన్ని ఎంపిక చేసుకున్నారు. జేఎన్‌టీయూలో సంయుక్త పరిశోధనలకు ఒక విదేశీ వర్సిటీ ముందుకు రాగా.. సాంకేతిక కారణాలతో ఆ పరిశోధనలు తాత్కాలికంగా ఆగిపోయాయి. న్యాక్ గ్రేడింగ్ లభించాలంటే విద్యార్థులు, ఆచార్యుల నిష్పత్తికి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను పరిగణనలోకి తీసుకుంటామంటూ ఎన్‌బీఏ హామీ ఇచ్చిందని జేఎన్‌టీయూలో విధులు నిర్వహిస్తున్న ఒక ప్రొఫెసర్ తెలిపారు. ఈ ఏడాది జూన్ నుంచి హామీ అమలయ్యే అవకాశాలు ఉన్నాయని వివరించారు.

# డిగ్రీలో ప్రతి సెమిస్టర్‌కూ ఓ టెక్నాలజీ సబ్జెక్టు!

(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రయత్నం దాదాపు కొలిక్కి వచ్చిందని సంబంధిత ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ మేరకు డిగ్రీలో బీఎస్సీ, బీకాంలతోపాటు బీఏ కోర్సుల్లోనూ వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ప్రతి సెమిస్టర్‌లో ఒక టెక్నాలజీ సబ్జెక్టును ఒక తప్పనిసరి పేపరుగా ప్రవేశపెట్టనున్నారు. డిగ్రీ మూడేళ్ల కోర్సుకు మొత్తం 120 క్రెడిట్లు, నాలుగేళ్ల ఆనర్స్ కోర్సుకు 160 క్రెడిట్లు ఇవ్వనున్నారు.

### ఆరు టెక్నాలజీ పేపర్లు... రెండు ఇంటర్న్‌షిప్‌లు

"టెక్నాలజీపై అవగాహన లేకుంటే ప్రస్తుత పరిస్థితుల్లో కెరీర్‌లో రాణించడం కష్టం. అలాంటి యువతకు ఉద్యోగావకాశాలు కూడా తగ్గుతాయి. అందుకే పరిశ్రమలకు తగినట్లు విద్యార్థులను తీర్చిదిద్దాలి. బీఏలాంటి కోర్సులు చేస్తున్న వారు సైతం చదువు పూర్తయ్యేలోపు ఉద్యోగ నైపుణ్యాలతో బయటకు వెళ్లాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరచూ చెబుతున్నారు. ఈమేరకు మూడేళ్ల డిగ్రీలో సెమిస్టర్‌కు ఒకటి చొప్పున సాంకేతికతకు సంబంధించిన పేపర్‌ను ప్రవేశపెడుతున్నారు. ఉదాహరణకు బీఏ అర్థశాస్త్రం మొదటి సెమిస్టర్‌లో బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, రెండో సెమిస్టర్‌లో డేటా అనాలసిస్, మూడో సెమిస్టర్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ డెవలప్‌మెంట్, నాలుగులో డిజిటల్ లిటరసీ, ఐదులో ఫండమెంటల్ ఆఫ్ ఏఐ టూల్స్ అండ్ టెక్నాలజీ, ఆరో సెమిస్టర్‌లో ఇంట్రడక్షన్ టూ సైబర్ క్రైమ్స్ అనే పేపర్లు ఉంటాయి. ఒక్కో దానికి మూడు క్రెడిట్లు కేటాయిస్తారు. ఇక ఐదు, ఆరు సెమిస్టర్లలో ఇంటర్న్‌షిప్‌లు తప్పనిసరి. ఒక్కో దానికి రెండు క్రెడిట్లు ఇస్తారు. జాతీయ నూతన విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ విద్యా ప్రణాళికను రూపొందిస్తున్నారు.

### కమ్యూనికేషన్ ఇంగ్లిష్‌పై దృష్టి

ఆంగ్లం అంటే ఇప్పటివరకు కొందరు ప్రముఖ రచయితల పాఠాలు, కవిత్వం లాంటి వాటికి ప్రాధాన్యమిస్తూ వచ్చారు. ఇకపై ప్రథమ భాషగా ఆంగ్లమే ఉన్నా కమ్యూనికేషన్ ఇంగ్లిష్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తొలి సెమిస్టర్‌లో ప్రథమ భాషగా ఇంగ్లిష్ కమ్యూనికేషన్, రెండో సెమిస్టర్‌లో క్రిటికల్ థింకింగ్ అండ్ రీజనింగ్, మూడో సెమిస్టర్‌లో బిజినెస్ కమ్యూనికేషన్ పేరిట ఆంగ్లం సబ్జెక్టు ఉంటుంది. బీకాంలోనూ అదేమాదిరిగా టెక్నాలజీ పేపర్లు ఉండనున్నాయి. బీఎస్సీ గణితం లాంటి వాటిల్లో మెంటల్ ఎబిలిటీ, రీజనింగ్, అర్థమేటిక్ లాంటి వాటిని సైతం చేరుస్తున్నారు. రానున్న విద్యా సంవత్సరాన్ని(2025-26) ఈసారి త్వరగా ప్రారంభించాలని భావిస్తున్న ఉన్నత విద్యామండలి... అతిత్వరలో సిలబస్‌ను ఖరారు చేసి, విశ్వవిద్యాలయాల ఆమోదం కోసం పంపనుంది. ఆ తర్వాత తెలుగు అకాడమీ పుస్తకాలను ముద్రించనుంది.